క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ

తడ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నందా రాజమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వైఎస్సార్ బీమా పంపిణీ


బీమా నగదు అందజేస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి (సైదాపురం): పట్టణంలోని 14వ వార్డు ధర్మాపురానికి చెందిన ఈతతొట్టి రాంప్రసాద్(45) గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ బీమా రూ.10వేలు స్థానిక వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వ ద్వారా అందాల్సిన సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు.

కండలేరులో 8.989 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలోగురువారం నాటికి 8.989 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 160 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలి

సైదాపురం: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను విక్రయించాలని నెల్లూరు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్ అన్నారు. మండలంలోని రామసాగరం, పాలూరు రాజుపాళెం, సైదాపురంలోని రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉన్న ఎరువులను గురువారం ఆయన పరిశీలించారు. వాటికి సంబంధించి రిజిస్టర్లను కూడా ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఏ సీజన్‌లో అయినా సరే ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట ఏఓ హైమావతి తదితరులున్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రాపూరు: అటవీ ఫలాలతో గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరావు అన్నారు. రాపూరు వెలుగు కార్యాలయంలో గురువారం వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లోని గిరిజన మహిళలకు ఉసిరి ఊరగాయ, షర్బత్ తదితరా తయారీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం ఉసిరి ఊరగాయలు, వట్టివేరుతో షర్బత్ తదితర వాటిపై ఐటీడీఏ సహకారంతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ్యమ్మ, ఏపీఎం మాధవి, సీసీ శ్యామల, శిక్షణ నిర్వాహకులు సందీప్, మురళీకృష్ణ, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా...

గూడూరురూరల్: స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన గూడూరు గాంధీనగర్ సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పురిటిపాళెం గ్రామానికి చెందిన వాకాటి వెంకటేష్(19) ఆటో నడుపుతూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు గాంధీనగర్ సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లారు. అందరూ కలసి ఈత కొట్టేసమయంలో వెంకటేష్ బురదలో కూరుకుపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నాలు చేసిన వీలుకాలేదు. పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు బురదలో కూరుకుపోయి ఉన్న వెంకటేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

1 నుంచి ముత్యాలమ్మ జాతర

చిల్లకూరు: వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు తూర్పుకనుపూరు ముత్యాలమ్మ జాతర జరుగుతుందని, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండల తీర ప్రాంతం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో గురువారం అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ పాలక మండలితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, బస్సుల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ కల్పనకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఆలయ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే మహిళా సాధికారత



రాపూరు: మహిళలకు చేయూత చెక్కును అందిస్తున్న పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, నాయకులు, దక్కిలి: చేయూత నమూనా చెక్కు పంపిణీ

రాపూరు: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు రూపకల్పన చేశారని వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి అన్నారు. రాపూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అవసరాలు గుర్తించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డేనన్నారు. మహిళలకు మరోసారి అన్ని పథకాలు అమలు కావాలన్నా, ప్రతి కుటుంబానికి మేలు జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రతి చిన్నారి చదువుకునేలా ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. అనంతరం 2,905 మంది మహిళలకురూ 5 కోట్ల 45 లక్షల చేయూత చెక్కును అందించారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, సర్పంచ్ భూపతి జయమ్మ, ఎంపీటీసీ సభ్యులు బుజ్జిరెడ్డి, నాయకులు మురళీమోహన్ రెడ్డి, కోటేశ్వరరెడ్డి, మధురెడ్డి, వెంకటసుబ్బయ్య, నరసింహరెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, ఘని, తహసీల్దార్ వెంకటరత్నం, ఎంపీడీఓ గంగయ్య, ఏసీ వెంకటేశ్వరావు, ఏపీఎం మాధవి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత

దక్కిలి: మహిళల ఆర్థిక ప్రగతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. డక్కిలి వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం ఆవరణలో గురువారం నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 2,528 మంది లబ్ధిదారులకు రూ.4కోట్ల 74 లక్షలు చెక్కును అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో ఎంపీపీ, జేసీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి ఎన్నికలకు వెళ్తోందన్నారు. మహిళ సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. దేశంలోనే మహిళల పేరుతో అత్యధిక సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది ప్రత్యేక స్థానమని తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లీలా మాధవి, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.నారాయణరెడ్డి, ఆర్.చిరంజీవి, ఎం.కోటేశ్వరరావు, కె.వేణుగోపాల్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.


రాపూరు: చేయూత కార్యక్రమానికి హాజరైన మహిళలు


దక్కిలి: సమావేశానికి హాజరైన మహిళలు

విజిలెన్స్ విచారణ చేపట్టాలి


విజిలెన్స్ విచారణ నిర్వహించాలని చైర్‌పర్సన్ భానుప్రియకు వినతి పత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు

- మున్సిపాలిటీలో నిధుల అవకతవకలపై కౌన్సిలర్లు ఆగ్రహం
- బడ్జెట్ సమావేశంలో అన్ని అంశాలకు ఆమోదం

వెంకటగిరి రూరల్: మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. వెంకటగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 బడ్జెట్ అంచనాలు ప్రారంభం నిల్వ అంచనాలు రూ.3.59 కోట్లు, మూల ధన జమలు రూ.10.40 కోట్లు, సాధారణ, మూలధనం ఖర్చులు రూ.62.96 కోట్లు, ముగింపు నిల్వగా రూ.37.43 కోట్లు నిధులు మిగులు బడ్జెట్‌గా అంచనాలతో 20 పేజీలతో కూడిన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. 6వ వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామయ్య మాట్లాడుతూ మున్సిపాలిటికీ సంబంధించి రూ.70 లక్షలు వరకు నిధులు అధికార దుర్వినియోగానికి గురైందని, దీనిపై విజిలెన్స్ సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. లీగల్ అడ్వైజర్ జయప్రకాష్ సూచనలతో 2021–22వ సంవత్సరంలో అవినీతిపై విజిలెన్స్ విచారణకు సిఫారసు చేయాలని కౌన్సిలర్లు అందరూ మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు వినతి పత్రం అందజేశారు. 21వ వార్డు కౌన్సిలర్ జి.ఢిల్లీబాబు మాట్లాడుతూ జగనన్నకాలనీలో చేపడుతున్న హౌసింగ్ నిర్మాణాలపై కాంట్రాక్టర్లు అవనీతికి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని సూచించారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీలో కోట్లు విలువ చేసే భూములు కబ్జాలకు గురవుతున్నాయని కాపాడాలని కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ తన వార్డులో సొంత నిధులతో పనులు చేపడితే బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ తమ వార్డులో చాలా మురికివాడ ప్రాంతమని ఈ మేరకు విద్యుత్ లైట్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీహెచ్ ఉమా మహేశ్వరి మాట్లాడుతూ దోమలు, కోతుల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధమ్మ మాట్లాడుతూ గతంలో మున్సిపాలిటీలో అభివృద్ధిని పక్కనపెట్టి నిధులు దుర్వినియోగానికి ఎక్కువ మొగ్గు చూపారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బడ్జెట్ సమావేశంలో అన్నీ అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


సౌజన్యమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రాజ్యలక్ష్మీ

బాలాయపల్లి (డక్కిలి): ఓజిలి మండలం పాళెంపాడు గ్రామంలో బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అక్క పిండుకూరు సౌజన్యమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మీ పాళెంపాడు గ్రామానికి చేరుకుని సౌజన్యమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఇరకం పోలింగ్ కేంద్రం పరిశీలన

తడ: తడ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీగా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి దేవరాజ్ పాటిల్ గురువారం ఇరకం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. దీవి గ్రామం అయిన ఇరకం చేరుకోవాలంటే ఎన్నికల అధికారులైనా, ఇతర ఏ అధికారైనా కేవలం పడవలో మాత్రమే ఇక్కడికి చేరుకోవాలి. పోలింగ్ మొదలయ్యే సమయం, పోలింగ్ ముగిశాక పోలింగ్ బాక్సులను ఒడ్డుకు చేర్చి, స్ట్రాంగ్ రూములకు చేర్చేందుకు అవసరమైన సమయం, భద్రత, ఇతరత్రా విషయాలను స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట తడ ఎస్‌ఐ నరసింహారావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

పెళ్లకూరు: ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు గురువారం మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు, పెళ్లకూరు తదితర వివాదాస్పద గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వివిధ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రవర్తించాలని సూచించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

బాలాయపల్లి(డక్కిలి): గీతాంజలిపై సోషల్ మీడియా వేదికగా అమానుష దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుర్రం మాధవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామతులసి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మన్నూరు గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇంటి పట్టా ఇచ్చారని సంతోషంగా మీడియాకు చెప్పిన తెనాలికి చెందిన గీతాంజలిని టీడీపీ, జనసేన మూకలు సోషల్‌మీడియాలో విక్రతంగా వేధించి, అసభ్యకరంగా దూషించి మానసిక క్షోభకు గురి చేశారన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన దోషులను వెంటనే శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ సమకూర్చిన ప్యాడ్లు, పరీక్షల సామగ్రిని అందజేశారు. అదే విధంగా బాలాజీనగర్‌లో 50 మంది పేద మహిళలకు చీరలు, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్, సంస్థ కార్యదర్శి జి.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి సుబ్రమణ్యం, ట్రెజరర్ శ్రీనివాసులు, చిల్లకూరు ఎంఈఓ రవూఫ్, పాఠశాల హెచ్.ఎం. భారతి, పేరంట్స్ కమిటీ చైర్మన్ విజయ్, పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియమావళి మేరకు విధులు నిర్వర్తించాలి

డక్కిలి: ఎన్నికల కోడ్ వెలువడిన తరువాత వెంటనే ఎన్నికల నియమావళి మేరకు విధులు నిర్వహించాలని సిబ్బందికి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల కోడ్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల చిత్రపటాలు కనిపించకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీచెంగాళమ్మ ఆలయంలో హుండీల లెక్కింపు


ఆలయంలో హుండీల లెక్కింపు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురువారం హుండీలను లెక్కింపు నిర్వహించగా ఈ సారి రూ.50 లక్షలు ఆదాయం చేకూరింది. దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 3 నెలల 8 రోజులకు గాను రూ.49,76,626 లక్షలు నగదు, 78 యూఎస్ డాలర్స్, 10 యూఏఈ దిరహమ్స్, 2 మలేషియా రింగ్గిట్, 5 కెనడా డాలర్స్, 55 వేలు ఇండోనేషియా కరెన్సీతో పాటు 70 గ్రాముల బంగారం, 183 గ్రాములు వెండి హుండీ ఆదాయం వచ్చింది. అన్నదానానికి రూ.55,891 వేలు విరాళం వచ్చిందని సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు, ఆలయ పాలకమండలి సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

కోట: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో గురువారం బీఎస్ఎఫ్ దళాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. చిట్టేడు, రాఘవాపురం, కోట, కేసవరంలో ఫుట్‌మార్చ్ నిర్వహించారు. వాకాడు సీఐ హరిక్రిష్ణ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న తహసీల్దార్, జేసీఎస్

దక్కిలి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం డక్కిలి వైకేపీ, ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత గల ప్రదేశమే దేవాలయమన్నారు. ప్రకృతిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, జేసీఎస్ మండల ఇన్‌చార్జీ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

వాకాడు: మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం టీవీ రమణయ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ వేషధారణలో నృత్యాలతో అలరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభకు తగిన బహుమతులను ఎంఈఓలు బీవీ కృష్ణయ్య, నసీంఅలీ చేతులు మీదుగా అందజేశారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కె దామోదర్‌రెడ్డి, సర్పంచులు ఎస్.అనిల్ కుమార్‌రెడ్డి, డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

వెంకటగిరి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్న విద్యార్థులు మంచి నాయకుడిని ఎంచుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు గిరిష్ రెడ్డి, సునీల్, ప్రవీణ్, కుమార్, వెంకీ తెలిపారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమర్థత కలిగిన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు వజ్రాయుధమని తెలిపారు. సాయి, సాత్విక్, నిఖేష్, దినేష్, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం కోసం కృషి చేయాలి


మహిళలతో నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ

వెంకటగిరి(సైదాపురం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త వెంకటగిరి నియోజవర్గ వైఎస్ ఆర్ సీపీ గెలుపు కోసం కృషి చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ తెలిపారు. పదేళ్ల తరువాత వెంకటగిరి రూరల్ మండలంలో సుదీర్ఘంగా పర్యటిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులను ఆత్మీయంగా పలకరిస్తూ నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. రూరల్ మండలంలోని వల్లివేడు గ్రామానికి చేరుకుని గ్రామస్తులు, మహిళలతో కొంతసేపు ముచ్చటించారు. అదే గ్రామానికి చెందిన వీరాస్వామి , జడపల్లి శీనయ్య, బత్రి శ్రీనివాసులురెడ్డి, బాలరాజు, ఎస్టీ కాలనీలోని ఈగ రత్నయ్య, బుసపాళెం గ్రామంలోని బ్రహ్మయ్య, గోదాటి నాగూరమ్మ, సుబ్బారావులను, అదేవిధంగా యాతలూరు గ్రామమంలోని బత్రి నారాయణరెడ్డి మృతి చెందడంపై వారి నివాసాలకు చేరుకుని ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాజకీయ పరంగా ప్రజలకు తనకు కొంచెం గ్యాప్ వచ్చిందని వెంకటగిరి ప్రజలకు నేదురుమల్లి కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. రానున సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉండి అత్యధిక మెజారిటీ అందించి సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్టీసీ మాజీ రీజనల్ కమిటీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు

పెళ్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి అన్నారు. గురువారం చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుండి అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు మల్లెమ్మ, మహాలక్ష్మీ, రుక్మిణమ్మ, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నాగమ్మ బంధువులకు రూ.10వేలు నగదు అందజేస్తున్న కౌన్సిలర్ సుబ్బారావు తదితరులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 1వ వార్డు బంగారుపేట దళితవాడకు చెందిన ఇల్లుపూరి నాగమ్మ(58) అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందింది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి రూ. 10వేలు స్వంత నిధులు అందజేశారు. ఈ మేరకు స్థానిక 1వ వార్డు కౌన్సిలర్ పేర్నేటి సుబ్బారావు నాగమ్మ బంధువులకు రూ.10 వేలు నగదు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు వలికల కృష్ణయ్య, మేకల శ్రీనివాసులు, శేఖర్, సాయితేజ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న పొనకా దేవసేనమ్మ, గోపాల్‌రెడ్డి, ఆర్డీఓ కిరణ్‌కుమార్

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ
- 7443 మంది మహిళలకు పట్టాలు ఇళ్ల పట్టాలు పంపిణీ

గూడూరు రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చి ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించడమే కాకుండా రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలతో పేదలకు పట్టాభిషేకం చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డి దేనని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం గూడూరు నియోజకవర్గంలోని గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 7443 మంది మహిళలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను ఆర్డీఓ కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డిలతో కలసి పంపిణీ చేశారు. గూడూరు పట్టణ, రూరల్‌లో 3814, చిల్లకూరు మండలంలో 890, కోట మండలంలో 1322, వాకాడు మండలంలో 832, చిట్టమూరు మండలంలో 580 మంది మహిళలకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం స్థలాలకు ఇంటి పట్టాలను పక్కాగా ఇస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ఇంతలా కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరూ అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, బాబురెడ్డి, ఊటుకూరు మహేంద్రరెడ్డి, సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కరుణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.